www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 29 మే 2025
5
కాకినాడ

గోదావరి బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్, కరప

ముమ్మిడివరం మండలం సలాదివారిపాలెం వద్ద గల గోదావరిలో ఈతకు వెళ్ళి ప్రమాదవశాత్తు మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ఎంపి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎంఎల్ఎ పంతం నానాజీ, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు పరామర్శించారు. కాకినాడ నగరంలోని గోళీలాపేటకు చెందిన సబ్బతి క్రాంతికిరణ్, సబ్బతి అభిషేక్, కరప మండలం గురజనాపల్లికి చెందిన తాతపూడి నితీష్‌కుమార్ కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఒక్కో కుటుంబానికి రూ.50 వేలు చొప్పున ఎంఎల్ఎ పంతం నానాజీ సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలు బురదమయం

- 3 రోజులుగా విస్తారంగా వర్షాలు
- మౌలిక సదుపాయాలు కరువు
- ప్రజలకు తప్పని అవస్థలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాలు లేని పేదలందరికీ స్థలాలను ఇచ్చి పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీలను నిర్మించింది. అయితే అప్పటి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చినప్పటికీ మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించకపోవడంతో ప్రస్తుతం ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్న లబ్ధిదారులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పంచాయతీరాజ్ శాఖ పలు కాలనీల్లో ప్రధాన రహదారులు మాత్రమే నిర్మించింది. కానీ పూర్తిస్థాయిలో వసతులు లేక నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రధానంగా రోడ్లు, డ్రయిన్లు వంటి కనీస సౌకర్యాలు కరువవ్వడంతో కాలనీవాసులు పడరాని పాట్లు పడుతున్నారు. గత నాలుగు రోజులుగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. భారీగా వర్షపాతం నమోదయింది. అల్పపీడనం ప్రభావంతో మరో 4 రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తుంది. ఈ ఏడాది ముందస్తుగానే రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకనున్నాయంటూ చెబుతోంది. ఈ వర్షాలకు జగనన్న కాలనీలన్నీ బురదమయంగా మారాయి. ఎక్కడకక్కడ నీరు నిలిచిపోవడంతో చెరువులను తలపిస్తున్నాయి.

కాకినాడ జిల్లాలో 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 21 మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఉన్న జగనన్న హౌసింగ్ కాలనీల్లో గత ప్రభుత్వ హయాంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన- వైఎస్ఆర్ (అర్బన్) బిఎల్‌సి పథకం, పిఎం ఆవాస్ యోజన వైఎస్ఆర్ (గ్రామీణ) పథకాల్లో రూ.1361.67 కోట్ల నిధులు విడుదల కాగా 81,873 ఇళ్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు 30 వేల ఇళ్ల నిర్మాణాలు కూడా జరగలేదు. లబ్ధిదారులు ముందుకు రాకపోవడంతో అనేక ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. పునాదులు దాటని ఇళ్లు వేలల్లో ఉన్నాయి. ప్రస్తుతం విపరీతంగా ధరలు పెరిగిపోయి ఉండడంతో పేదలైన లబ్ధిదారులు నిర్మాణాలకు వెనకడుగు వేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో ప్రతి లబ్ధిదారునికీ ఒక సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర స్థలం ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలోనే లబ్ధిదారు మూడు ప్రత్యామ్నాయాలు ఎంపిక చేసుకోవచ్చునని అధికారులు చెప్పినా నిర్మాణాలు అంతగా ముందుకు సాగడం లేదు. మొదటి ఎంపికలో ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వమే అన్ని నిర్మాణ వస్తువులు, వ్యయం సమకూరుస్తుందని సొంతంగా కట్టుకోవచ్చు. రెండవ ఎంపికలో నిర్మాణ సామగ్రి లబ్ధిదారు తెచ్చుకుని కట్టుకోవచ్చు. దశలవారీగా ప్రభుత్వమే ఖర్చు చెల్లిస్తుందని అధికారులు తెలిపారు. ఈ ఇబ్బందులు పడలేమని అనిపిస్తే మూడవ ఎంపికలో ప్రభుత్వమే నాణ్యమైన సామాగ్రితో ఇల్లు నిర్మించి ఇస్తుందని తెలిపారు. అనేక మంది మూడో ఆప్షన్‌ను ఎంపిక చేసుకున్నా నిర్మాణాల్లో పురోగతి లేదు.

మొర ఆలకించేవారేరీ..?

ప్రస్తుతం జిల్లాలో ఉన్న అన్ని జగనన్న కాలనీల్లో 25 వేలకు పైనే కుటుంబాలు నివాసం ఉంటున్నాయని అంచనా. గత ప్రభుత్వం ఈ కాలనీల్లో మౌలిక వసతులపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేకపోయింది. ఈ నేపథ్యంలో 2024 ఏప్రిల్ సార్వత్రిక ఎన్నికలు ముందుకు వచ్చాయి. వైసిపి ప్రభుత్వం ఓటమి చెంది కూటమి సర్కారు అధికారంలోకి వచ్చింది. కానీ ఈ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించే నాథుడే కనిపించడం లేదంటూ పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు విపరీతంగా కురుస్తున్నాయి. ఎక్కడకక్కడ నీరు నిలిచిపోవడంతో రోడ్లన్నీ జలమయంగా మారాయి. చెరువులను తలపిస్తున్నాయి. ఇళ్ల నుంచి బయటకు అడుగు పెట్టాలంటే ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. స్థలాల కొరత వల్ల గత సర్కారు ఊరికి దూరంగా పల్లపు ప్రాంతాల్లో లే అవుట్లను కేటాయించడంతో అక్కడే అధికారులు నిర్మాణాలను చేపట్టారు. ప్రణాళికాబద్ధంగా ఈ లే ఔట్లు వేయకపోవడంతోనే ప్రస్తుతం అనేక అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తుందంటూ కాలనీలో నివాసం ఉంటున్న ప్రజలు వాపోతున్నారు. కాకినాడ రూరల్ కరప, కాజులూరు, తాళ్లరేవు, జగ్గంపేట, తుని రూరల్, పిఠాపురం రూరల్, గొల్లప్రోలు, పెద్దాపురం, సామర్లకోట ఇలా పలు ప్రాంతాల్లో ప్రస్తుతం ఈ కాలనీలన్నీ ముంపులోనే ఉన్నాయి. రోడ్లు, డ్రయినేజీల సమస్యలతో పాటు తాగునీటి ఇబ్బందులు సైతం ఎక్కువగా కనిపిస్తున్నాయి. తాగునీటి అవసరాలను తీర్చేందుకు రూ.22124.61 లక్షల అంచనా విలువతో వివిధ పనులు మొదలు కాగా రూ.11153.89 లక్షల అంచనా విలువ గల 188 పనులు ఖరారు అయ్యాయి. ఇందులో రూ.1906.07 లక్షల విలువైన 175 పనులు ఇప్పటి వరకూ పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం కనీస సౌకర్యాల కల్పనపై అధికారులు దృష్టి సారించాలంటూ కాలనీలవాసులు కోరుతున్నారు.

అడుగు పెట్టలేకపోతున్నాం

గత మూడు రోజులుగా వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయి. మా కాలనీలో రోడ్లు, డ్రయినేజీలు సౌకర్యం లేదు. బయటకు అడుగు పెట్టాలంటేనే హడలి పోతున్నాము. ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి కనీస సౌకర్యాలు కల్పించాలి. చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

- ఎం.అమ్మాజీ, గొల్లప్రోలు జగనన్న కాలనీ.

తాగునీటికి ఇబ్బందులు

గొల్లప్రోలు నగర పంచాయతీకి దూరంగా మా కాలనీ ఉంది. రోడ్లు, డ్రయినేజీల సమస్యతో పాటు తాగునీటి కోసం పడరాని పాట్లు పడుతున్నాం. 12 రోజులకు ఒకసారి మాత్రమే వాటర్ ట్యాంకర్ ద్వారా సరఫరా అవుతుంది. వీధి లైట్లు కూడా వెలగడం లేదు. అధికారులు స్పందించి వసతులు కల్పించాలి.

- అనిశెట్టి నానాజీ, స్థానికుడు, జగనన్న కాలనీ

సమావేశంలో మాట్లాడుతున్న ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కన్వీనర్ పి శ్రీనివాస్

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలి

-ప్రజారోగ్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రయివేటీకరణ చేయడం తగదని, రాష్ట్ర ప్రభుత్వం పి4 విధానం ఉపసంహరించుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. స్థానిక యుటిఎఫ్ టీచర్స్ హోంలో ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో 'ప్రభుత్వ వైద్య కళాశాలలు - ప్రయివేటీకరణ' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ప్రజారోగ్య వేదిక నగర కన్వీనర్ పి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనలో జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన నేపథ్యంలో 5 వైద్య కళాశాలలు ప్రారంభించారని తెలిపారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం పి4 విధానంలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటుపరం చేయడానికి ప్రయత్నించడం ప్రమాదకరమన్నారు. ఇప్పటికే 70 శాతం వైద్యం, వైద్య పరీక్షలు ప్రయివేటు పరం కావడం వల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు అప్పులపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వమే వైద్య కళాశాలలను ప్రయివేటుపరం చేస్తే వైద్యంలో నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. వైద్యం పూర్తిగా సరుకుగా మారిపోయే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రయివేటుపరం చేసే ప్రయత్నాలు విరమించుకోవాలన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ గోపినాథ్ మాట్లాడుతూ ఇప్పటికే ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పిహెచ్‌సి, సిహెచ్‌సిలలో సేవలు మెరుగుపరచడానికి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పలువురు ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ ప్రయివేటుగా ప్రారంభమై ప్రభుత్వం స్వాధీనం చేసుకుందన్నారు. ఈ నేపథ్యాన్ని ప్రభుత్వం, సంబంధిత అధికారులు గమనించాలన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రయివేటీకరణ ఆపాలని, ఇప్పటికే ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్య, వైద్య, ఆరోగ్య రంగాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేస్తూ తీర్మానించారు. ఈ సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ప్రజాసంఘాల నాయకులు జి.ప్రభాకరవర్మ, కె. సత్తిరాజు, మేడిశెట్టి వెంకటరమణ, పలివెల వీరబాబు, ఎంఎ.స్వామి, చంద్రమళ్ళ పద్మ, జి.స్వామినాయుడు, మహ్మద్ ఇబ్రహీం, కెవివి.నగేష్, జిఎస్.వర్మ, మలక వెంకటరమణ, పద్మనాభం, హరనాథ్, రామకృష్ణ, సూర్యనారాయణ, వెంకటేష్, ఎఆర్‌సి.వర్మ, మేడిశెట్టి వెంకటరమణ, పలువురు వైద్యులు, వైద్య ఆరోగ్య శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

జెవివి ప్రాంతీయ వర్క్‌షాప్

ప్రజాశక్తి - కాకినాడ

జనవిజ్ఞాన వేదిక ప్రాంతీయ వర్క్‌షాప్ బుధవారం స్థానిక యుటిఎఫ్ హోంలో జరిగింది. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కెఎంఎం ఆర్.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ వర్క్‌షాప్‌లో తొలుత 'చరిత్రలో సైన్స్' అనే అంశంపై మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడారు. చరిత్రలో ఏ సందర్భంలో సైన్స్ ఏవిధంగా వ్యవహరించిందనేది వివరించారు. మధ్యాహ్నం సెషన్‌లో మాజీ ఎంఎల్‌సి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ 'జనవిజ్ఞాన వేదిక నిర్మాణం- కొన్ని ప్రాధాన్యతలు' అనే అంశంపై మాట్లాడారు. జూన్ ఒకటవ తేదీ నుంచి జన విజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతుందని తెలిపారు. ఈ వర్క్‌షాపులో ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల వివిధ స్థాయి బాధ్యులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి బాలసుబ్రహ్మణ్యం

22వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట

సమస్యల పరిష్కారం కోసం పెద్దాపురం, సామర్లకోట మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి 22వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయా మున్సిపల్ కార్యాలయాల ఎదుట జరుగుతున్న సమ్మె శిబిరాల్లో యూనియన్ నాయకులు మాట్లాడారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న తమకు వేతనాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురంలో జరిగిన కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షులు సుంకర నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు బాసిన భద్రరావు సుంకర సత్తిరాజు, టి.రాజు, గజ్జ.సతీష్, ఎస్‌కె.బషీర్, సామర్లకోటలో జరిగిన నిరసన కార్యక్రమంలో కార్మికులు రామరాజు, కృష్ణ, రత్నరాజు, రమేష్, మురళీకృష్ణ, సత్యనారాయణ, భూదేవి, నాగార్జున, వెంకటేశ్వరరావు, స్వామి, రాజేష్, రమణమూర్తి పాల్గొన్నారు.

పెద్దాపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి

జిల్లాలో నందమూరి తారక రామారావు 102వ జయంతి ఘనంగా జరిగింది. మండలాలు, గ్రామాల్లో టిడిపి నాయకులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. నాయకులు, కార్యకర్తలు స్వీట్లు తినిపించుకున్నారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ కలెక్టరేట్‌లో మాజీ సిఎం నందమూరి తారకరామారావు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, డిఆర్ఒ వెంకటరావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొని ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గదుల సాయి బాబు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది, ఎన్‌టిఆర్ అభిమానులు పాల్గొన్నారు. **జగ్గంపేట** స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ 102వ జయంతిని ఘనంగా నిర్వహించారు. అలాగే చెరువు గట్టు, ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద గల ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, టిడిపి నాయకులు జీను మణిబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, వేములకొండ జోగారావు, బద్ధి సురేష్ పాల్గొన్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి భాస్కరరావు, ఎపిఒ రమణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పాలంకి నాగరాజు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సింగం బుల్లయ్య, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు. **కరప** స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గల ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చుండ్రు వెంకన్నరావుచౌదరి, కోటగిరి మహేంద్రబాబు, గండి వెంకటేశ్వరరావు, మద్దూరి వీర వెంకట సత్యనారాయణస్వామి, కాకర్ల బుజ్జిబాబు, ఆట్ల గోవిందు, పంపన కన్నారావు పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక మఠం సెంటర్లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పట్టణ టిడిపి అధ్యక్షులు అడబాల కుమారస్వామి, కార్యదర్శి బడుగు శ్రీకాంత్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. 14వార్డ్, లారీ స్టార్ రోడ్డులోని ఎన్‌టిఆర్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్, రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, భీమేశ్వర స్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్ కంటే బాబు, సొసైటీ మాజీ అధ్యక్షులు పైన్నీ శ్రీనివాసరావు, కౌన్సిలర్ బలుసు వాసు, పట్టణ యువత అధ్యక్షులు వల్లూరి దొరబాబు పాల్గొన్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కె.హిమామహేశ్వరి ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం ఎఒ సతీష్, ఎపిఒ రాయి ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ జగన్నాథం, సిబ్బంది పాల్గొన్నారు. **తాళ్లరేవు** స్థానిక సంతపేట, గాడిమొగ పంచాయతీలో ఎన్‌టిఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకుడు విళ్ళ సత్యనారాయణ టిడిపి జెండాను ఆవిష్కరించారు. మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు వెంటపల్లి ఉమామహేశ్వరి కేక్ కట్ చేశారు. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ, మండల ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు ప్రభుత్వాసుపత్రిలో రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వేగేశ్న భాస్కరరాజు, టిళ్ళపూడి నాగేశ్వరరావు, వాశంశెట్టి శ్రీనివాస్, సంగాడి కామేశ్వరరావు, కొత్తూరి కాశీ, రోళ్ళ చక్రవర్తి, గంజా సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు. **పెద్దాపురం** పట్టణ, మండల పరిధిలో ఎన్‌టిఆర్ జయంతి ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గుర్రాల సెంటర్, మసీదు సెంటర్, కొండయ్య పేటలలోని ఎన్‌టిఆర్ విగ్రహాలకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు రంది సత్యనారాయణ, కొరుపూరి రాజు, కొత్తిం బాబు, పాల్గొన్నారు. అలాగే మన పెద్దాపురం ఫేస్‌బుక్ బృందం ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా టిడిపి యువ నాయకులు మార్ని చిన్న ఆర్థిక సాయంతో ప్రభుత్వాసుపత్రి వద్ద గర్భిణులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు. **కిర్లంపూడి** జగపతినగరం మాజీ ఉపసర్పంచ్, శ్రీ సాయి చరణ్ జ్యుయలర్స్ అధినేత తోట గోపిత్రినాథ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మాదిరెడ్డి వాణి విజయలక్ష్మి చేతుల కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో తోట మోహిని, మాదిరెడ్డి రూపా దేవి, కోకా చరణ్, మాదిరెడ్డి సాయి తరుణ్, కొడేల నల్లబ్బాయి, ఆళ్ల బాబులు, తదితరులు పాల్గొన్నారు. **గండేపల్లి** స్థానిక జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద తెలుగు యువత ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **గొల్లప్రోలు** స్థానిక మెయిన్ రోడ్‌లో ఎన్‌టిఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణ టిడిపి అధ్యక్షులు గుండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కౌన్సిలర్ గుల్ల సుబ్బారావు, బస సత్యనారాయణ, బస రాజు, పడాలి ఏసుబాబు, తాతాజీ, దంగేటి రామకృష్ణ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెసి రాహుల్‌మీనా

సామర్లకోటలో నినాదాలు చేస్తున్న టిడిపి శ్రేణులు

కిర్లంపూడిలో స్వీట్లు తినిపిస్తున్న టిడిపి నాయకులు తోట గోపినాథ్

కార్టూ'నిజం'

ఉపాధి కూలీలకు వేతనాలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - కాజులూరు

ఉపాధి హామీ కూలీలకు చెల్లించాల్సిన వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.ఈశ్వరరావు, కెఎస్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని శిలపాక, తణుకు, వాడ గొల్లపాలెం, చేదువాడ గ్రామాల్లో వారు పర్యటించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల ప్రాంతాలను సందర్శించారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. పని ప్రాంతంలో ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉపాధి హామీ చట్టం ద్వారా పని ప్రదేశాల్లో అనేక సౌకర్యాలు కల్పించేవారని అన్నారు. కానీ నేడు ఎటువంటి సౌకర్యాలను కల్పించడం లేదని విమర్శించారు. ప్రతీ 15 రోజులకు ఒకసారి వేతనాలు చెల్లించే విధానానికి పాలకులు స్వస్తి పలికారని అన్నారు. పనిముట్లు ఇవ్వడం లేదని, పని ప్రదేశంలో టెంట్లు వేయడం లేదని, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచడం లేదన్నారు. పనులు చేసి ఆరు వారాలు గడుస్తున్న వేతనాలు ఇవ్వకపోతే కూలీలు ఏమి తిని బతుకుతారని వారు ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి అధిక నిధులు కేటాయించాలని, కూలీలకు అవసరమైన పనిముట్లు, పని ప్రాంతంలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జూన్ ఒకటో తేదీ నాటికి వేతన బకాయిలను చెల్లించకపోతే సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. ఈ పర్యటనలో సంఘం నాయకులు పి.కృష్ణ, ఎం.చల్లారావు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న కెఎస్.శ్రీనివాస్, టి.ఈశ్వరరావు

సమ్మెను జయప్రదానికై కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిఐటియు నాయకులు

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

కార్మిక హక్కుల పరిరక్షణ కోసం జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెని విజయవంతం చేయాలని మండల సిఐటియు ప్రధాన కార్యదర్శి కెవివి.సత్యనారాయణ కోరారు. బుధవారం వాకతిప్ప గ్రామంలో భవన నిర్మాణ కార్మికులతో కలిసి ప్రజలకు సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌తో కార్మికుల హక్కులు హరించబడతాయని అన్నారు. హక్కులను కాపాడుకునేందుకు జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో. భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల కార్యదర్శి సిహెచ్.సాంబశివకుమార్, సిఐటియు మండల అధ్యక్షులు కె.నాగేశ్వరరావు, ఎ.వాసు, ఎ.సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల హక్కులను కాలరాస్తున్న పాలకులు

ప్రజాశక్తి - జగ్గంపేట

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీల హక్కులను కూటమి ప్రభుత్వం కాలరాస్తుందని బహుజన సమాజ్ పార్టీ(బిఎస్‌పి) జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ జుత్తుక నాగేశ్వరరావు ఆరోపించారు. గుంటూరు జిల్లా తెనాలిలో దళిత, మైనారిటీ యువకులను నడిరోడ్డుపై పోలీసులు కర్కశంగా చిత్రహింసలకు గురిచేసిన సంఘటనకు నిరసనగా బుధవారం మండలంలోని రామవరం కొత్త కాలనీలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలపై దాడులు పెరిగిపోయాయన్నారు. కూటమి నాయకుల అండతో పోలీసులు విచక్షణ రహితంగా నడిరోడ్డుపై యువకులను హింసంచిడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీలోని ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న దళితులు

ఎంఎల్ఎను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

కడపలో జరుగుతున్న మహానాడులో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభను నియోజకవర్గ టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సిబిఎన్ ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ళ జగదీష్‌కు ఎంఎల్ఎ సత్యప్రభ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

ఎంఎల్ఎతో టిడిపి శ్రేణులు

నేరాలు ఘోరాలు

బెల్టుషాపులపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని రంపయర్రంపాలెంలోని బెల్టుషాపులపై పోలీసులు దాడి చేశారని ఎస్ఐ విఎన్వి.పవన్‌కుమార్ తెలిపారు. బెల్టు షాప్ నిర్వహిస్తున్న కాకర్ల వంశీకృష్ణను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అతని నుంచి 12 కింగ్ ఫిషర్ బీర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. ఎక్కడైనా నాటు సారా, మద్యం అక్రమ అమ్మకాలు, జూదాలు నిర్వహిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

'పంపా'లో బాలుడు మృతి

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం పంపానదిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు ఒక బాలుడు మృతి చెందినట్లు అన్నవరం పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ప్రకారం..కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామం చెందిన వాసంశెట్టి వెంకటరమణ తన కుటుంబ సభ్యులతో సత్యదేవుని దర్శనం కోసం ఆటోలో అన్నవరం వచ్చాడు. పంపా నదిలో స్నానం ఆచరించి కొండపై వెళ్దామని పంపానదిలో స్నానం చేస్తుండగా వారిలో ముగ్గురు యువకులు మునిగిపోయారు. వారిలో ఇద్దరిని రక్షించగా, మరోక బాలుడు చరణ్ తేజ(16) గల్లంతయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు స్థానికంగా ఉండే గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. సంఘటన ప్రాంతానికి కొద్ది దూరంలో చరణ్‌తేజ మృతదేహం లభించింది. సంఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు ఆ బాలుడి మృతదేహాన్ని ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి కేసులో ఏడుగురు అరెస్టు

ప్రజాశక్తి - రావులపాలెం

మండల పరిధి ఊబలంక గ్రామ శివారు ఏటిగట్టు వద్ద బుధవారం ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి అర కేజీ గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు రావులపాలెం టౌన్ సిఐ ఎం.శేఖర్ బాబు తెలిపారు. ఏటిగట్టు పక్కన రావి చెట్టు వద్ద ఊబలంకకు చెందిన సత్తి భాస్కర వీర రెడ్డి, పెనంగి సింహాద్రి, రావులపాలెంకు చెందిన సిరిగినీడి పవన్, సత్తి వీర సత్యా సాగర్ రెడ్డి, మల్లిడి కిరణ్ రెడ్డి, ఆత్రేయపురం మండలం మెర్లపాలెం శివారు వాసంశెట్టి వారి పాలెంకు చెందిన వాసంశెట్టి చంద్రమౌళి, ర్యాలికి చెందిన మామిడిపల్లి నాగరాజులు అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో పోలీసులు వారిని విచారించారు. వారి వద్ద తాగడానికి, అమ్మడానికి సిద్ధంగా ఉంచిన రూ.5 వేల విలువైన 500 గ్రాముల గంజాయి గుర్తించి తహశీల్దార్ బియం ముక్తేశ్వరావు, ఆర్ఐ సూర్యాకాంతం ఆధ్వర్యంలో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామని సిఐ తెలిపారు.

రఘునాథపురంలో చోరీ

ప్రజాశక్తి - రాజానగరం

మండలంలో రఘనాథపురానికి చెందిన బల్లి వెంకటేశులు ఇంట్లో దొంగలు ప్రవేశించి బంగారు, వెండి వస్తువులు దొంగిలించారు. వెంకటేశులు కుటుంబం ఈ నెల 25న తిరుపతి వెళ్లారు. ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని పక్కింటి వారు సమాచారం ఇవ్వడంతో బుధవారం హుటాహుటిన వచ్చారు. ఇంటిని పరిశీలించగా బీరువాలో ఉన్న 64 గ్రాముల బంగారం, 850 గ్రాముల వెండి వస్తువులు చోరీకి గురైనట్టు గుర్తించారు. వీటి విలువ రూ.1.77 లక్షలు ఉంటుందన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ నాగార్జున తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-కడియం

ఒంటరిగా నివసిస్తున్న మహిళపై పట్టపగలు దాడి చేసి చోరీకి పాల్పడ్డ ముగ్గురు వ్యక్తులను కడియం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కడియం మండలం వేమగిరి దేవి జనార్ధన్ నగర్‌లో దుళ్ల అనంతలక్ష్మి ఒంటరిగా నివాసం ఉంటుంది. ఈ నెల 26న ముగ్గురు వ్యక్తులు ఆమె ఇంటికొచ్చి దాడి చేసి నగదు, వెండి, బంగారం వస్తువులు దోచుకుపోయారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ధనలక్ష్మి ప్రసన్న, ఎస్ఐ దుర్గాప్రసాద్ నిందితులను కడియం రైల్వే స్టేషన్ సమీపంలో పట్టుకున్నారు. చోరీ చేసిన వస్తువులు, నగదును రికవరీ చేశారు. న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని సౌత్ జోన్ డిఎస్పి అభినందించారు.

లారీ ఢీకొనడంతో నాలుగు పశువులు మృత్యువాత

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు శివారు మీనానగరంలో మంగళవారం రాత్రి లారీ ఢీకొనడంతో నాలుగు పశువులు మృత్యువాత పడ్డాయి. టిప్పర్ లారీ వేగంగా వచ్చి ఢీకొనడంతో రెండు గేదెలు, ఒక దూడ, ఒక దున్నపోతు మృత్యువాత పడ్డాయన్నారు. గేదెల యజమాని కలేరియా మంగారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు.

మరిడమ్మకు పూజలుచేస్తున్న జడ్జ్ గోవర్ధన్‌రావు

మరిడమ్మను దర్శించుకున్న జిల్లా జడ్జి

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మను కాకినాడ జిల్లా జడ్జి గోవర్ధన్‌రావు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆశాధులు, పూజారులు, వేద పండితులు, దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం ఆయనకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

వారపు సంత.. సమస్యల చింత...

ప్రజాశక్తి - రౌతులపూడి

గ్రామీణ ప్రాంతాల్లో వారపు సంతలే ప్రజలకు సూపర్ మార్కెట్లు, మాల్స్. అలాంటి సంతల్లో కనీస వసతులు కరువుతున్నాయి గ్రామీణాభివృద్ధిని ప్రభుత్వం విస్మరించడంతో వారపు సంతలకు వసతులు ఉండడం లేదు. వారం రోజులకు అవసరమైన సరుకులను సంతల్లోనే ప్రజలు కొనుగోలు చేస్తూ ఉంటారు.

మండలంలోని సబ్ ప్యాన్ ఏజెన్సీ ప్రాంతమైన మాతయ్యపేట, ఎస్.పైడిపాల గ్రామాల్లో నిర్వహించే వారపు సంతలకు కొండలపై నివసిస్తూ స్థానికంగా ఉన్న అటవీ సంపదలను మైదాన ప్రాంతంలోని ప్రజలకు విక్రయించి తద్వారా వారికి అవసరమైన సరుకులను కొనుగోలు చేస్తూ గిరిజనులు జీవనోపాధి పొందుతున్నారు. అలాంటి సంతలకు సైతం కూడా కనీస సౌకర్యాలు లేకపోవడంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని ములగపూడి, బలరామపురం, లచ్చిరెడ్డిపాలెం గ్రామాల్లో వారపు సంతలు సాగుతున్నాయి ఆయాసంతల్ల కిరాణా, కూరగాయలు, చేపలు, మాంసం, తినిబండారాలు తదితర వర్తకం సాగుతోంది. ఆయా గ్రామాల్లో అధికారులు ప్రజాప్రతి నిధులు స్పందించి స్థలం కేటాయించి షెడ్లు ఏర్పాటు చేసి వారపు సంతల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు

రైతు బజారు స్థాయికి చేరుకునేది ఎప్పుడు

మండలంలోని రౌతులపూడిలో ఉన్న మార్కెట్‌కు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ వారు పండించే కూరగాయలు రైతులకు మార్కెట్‌కే తీసుకువచ్చి విక్రయించాల్సి ఉంది. అటువంటి మార్కెట్‌కు పూర్తి స్థాయి సౌకర్యం లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ధర ఉన్నా లేకపోయినా నిల్వ చేసుకునేందుకు అవకాశం లేకపోవడంతో దళారులు చెప్పిన రేటుకే విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. రౌతుల పూడి మార్కెట్‌కు పంటలు నిల్వ చేసేందుకు కోల్డ్ స్టోరేజ్ లాంటి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని రైతులు కోరుతున్నారు

సహకారం అందిస్తాం

వారపు సంతల అభివృద్ధికి మా వంతు సహాయ సహకారాలు అందిస్తాం. పంచాయతీ కార్యదర్శులతో తక్షణమే సమావేశాలు నిర్వహించి ఆయా గ్రామాల్లో ఉన్న ఖాళీ స్థలాల వివరాలను తెలుసుకుని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లతాం. అధికారుల ఆదేశాలతో వారపు సంతల్లో షెడ్లు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

- శివరామకష్ణయ్య, ఎంపిడిఒ.

కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

జెఎన్‌టియుకెలో ఏళ్ళతరబడి సేవలు అందిస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సాంకేతిక కారణాలతో విధులకు దూరం చేయడం తగదని, తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సిఎస్ఆర్‌కె.ప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడగా సాంకేతిక నిబంధనలు అమలు చేస్తున్నామని, కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఎవరినీ విధులకు దూరం చేయబోమని చెప్పారని, అయితే ఇందుకొరకు కమిటీ వేసినట్లు చెప్పారన్నారు. యూనివర్సిటీ గౌరవం కాపాడే విధంగా అధికారులు వ్యవహరించాలని, ఏమి జరిగినా సంస్థ అధినేతగా వైస్ ఛాన్సలర్ బాధ్యత వహించాలన్నారు. తదుపరి వాట్సాప్ ద్వారా వినతి పంపించామన్నారు. యూనివర్సిటీ పరిధిలో పోలీసు వారు అవసరం లేకుండా చూడాలని, అసిస్టెంట్ ప్రొఫెసర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, చాలా కాలంగా అనుసరిస్తున్న విధానమే ప్రస్తుతం అమలు చేయాలని, తదుపరి అసిస్టెంట్ ప్రొఫెసర్ల కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి, ప్రొఫెసర్ల శ్రేయస్సు కోసం చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వైస్ ఛాన్సలర్ సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కరిస్తారని ఆశిస్తున్నామన్నారు. లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో ప్రత్యక్ష కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు.

టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి సుభాష్

టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - కాజులూరు

కడపలో జరుగుతున్న టిడిపి మహానాడు వేదికపై కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో వైసిపికి చెందిన పలువురు నాయకులు బుధవారం టిడిపిలో చేరారు. మండలంలోని బంధనపూడి గ్రామ మాజీ సర్పంచ్, మండల సర్పంచుల సమాఖ్య మాజీ అధ్యక్షు రాలు జక్కన సూర్యకుమారి భర్త రాజేష్, గొల్లపాలెం మాజీ సర్పంచ్ వడ్డే సత్యవతి భర్త కొండబాబు, యువ నాయకులు తలాటం సత్తిరాజు మండల టిడిపి అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, పార్టీ నాయకుడు చుండ్రు వీర్రాజు చౌదరి ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. వారికి మంత్రి సుభాష్ టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఎప్పటికప్పుడు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల సమక్షంలోనే ఎండగడతామని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరిబాబు అన్నారు. వైసిపికి చెందిన సురాబత్తుల కొండలరావు అనారాగ్యానికి గురయ్యాడు. ఆయనను బుధవారం పరామర్శించారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందని, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి పదవులను కేటాయించడం జరుగుతుందని అన్నారు. గ్రామాల్లో పార్టీని పటిష్టం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటిక్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి శిడగం వెంకటేశ్వరరావు, సర్పంచ్ జి.వెంకటరమణ, నాయకులు కె.ప్రసాద్, ఎస్.చిన్నారావు, వాగు బలరాం పాల్గొన్నారు.

కొండలరావును పరామర్శిస్తున్న గిరిబాబు

ఆదిత్య అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ జొన్నలగడ్డ పవన్ డాక్టరేట్ సాధించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రవీంద్రనాథ్‌ఠాగూర్ విశ్వవిద్యాలయం ఇఇఇ విభాగానికి చెందిన విభాగాధిపతి డాక్టర్ ప్రతీక్ నిగమ్ నేతృత్వంలో ఒడిసాకు చెందిన సంబల్పూర్ యూనివర్సిటీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్. డాక్టర్ శుభ్రాంసు పధీ పర్యవేక్షణలో "ఇన్వెస్టిగేషన్ ఆఫ్ పవర్ కన్వెర్టర్ టోపాలజి అండ్ కంట్రోల్ యాస్పెక్ట్స్ ఆఫ్ ఫోటో వోల్టాయిక్ మైగ్రోగ్రిడ్" అనే అంశంపై సమర్పించిన థీసిస్‌కు డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, ఆదిత్య యూనివర్సిటీ ప్రో వైస్ చాన్సలర్, ఆదిత్య విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, మంచి సంస్కరణలతో విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రో ఎంబి.శ్రీనివాస్, ప్రో. వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎ.రమేష్, డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్. డాక్టర్ జి.సురేష్, విభాగాధిపతి డాక్టర్.వి.శ్రీనివాసరావు, డీన్లు, వివిధ విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లు, ఉపాధ్యాయేతర సిబ్బంది డాక్టర్ జొన్నలగడ్డ పవన్‌కు అభినందనలు తెలిపారు.

బాక్స్ క్రికెట్ ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని పులిమేరు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్‌ను డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు. క్రీడలతో మానసిక వికాసంతో పాటు శారీరిక ఆరోగ్యం పొందవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టర్ బోడపాటి శివదత్, తుమ్మల నాని, వంగలపూడి దుర్గాజి, నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ జట్లా విజయ్‌బాబు, రాంబాబు, బుజ్జి, రాచకొండ వెంకటేష్, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాక్స్ క్రికెట్‌ను ప్రారంభిస్తున్న తుమ్మల బాబు

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలోని అనుశ్రీ సినిమాస్(జయలక్ష్మి) సినిమా థియేటర్లలో ఫుడ్ సేఫ్టీ తనిఖీ అధికారి సుబ్బారావు తనిఖీలు నిర్వహించారు. మంగళవారం థియేటర్‌లో నిర్వహించిన తనిఖీల్లో భాగంగా కేంటీన్‌లో కంపెనీ పేరు వివరాలు లేని బంగాళా దుంప చిప్స్ 77 పేకెట్లను సీజ్ చేశారు. సంబంధిత నివేదికను తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి కలెక్టర్‌కు నివేదించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలతో ఫుడ్ సేఫ్టీ తనిఖీ అధికారి సుబ్బారావు బుధవవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ చేయడం జరిగిందని, తనిఖీ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానని తెలిపారు. ఈ తనిఖీల్లో తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర రెడ్డి, విఆర్ఒ నూతలపాటి లోవరాజు, థియేటర్ మేనేజర్ వద్రే సతీష్, తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు చేస్తున్న అధికారులు

కిశోర బాలికలకు అవగాహన పెంచాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

కిషోర్ బాలికల్లో వచ్చే మార్పులపై ఎప్పటికప్పుడు తల్లులతోపాటు, ఆశ, అంగన్‌వాడీ, ఎఎన్ఎం కార్యకర్తలు అవగాహన కల్పించాలని పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ ఎం.సౌమ్య పిలుపునిచ్చారు. రుతుక్రమ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యుక్త వయస్సులో వచ్చే మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది, ఎఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య శాఖ సిబ్బంది

30న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కాజులూరు

విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తొలగించేందుకు చేపట్టే మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎన్.ఉదయభాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు కాజులూరు సబ్ స్టేషన్ లో పరిధిలోని కాజులూరు, ఐతపూడి, తిప్పరాజుపాలెం, ఒంటితాడి, పల్లిపాలెం, శీల గ్రామాలతోపాటు, పరిశ్రమలు, ఆక్వా ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆరోగ్యానికి యోగా అవసరం

ప్రజాశక్తి - యంత్రాంగం

జగ్గంపేట స్థానిక కాపు కల్యాణ మండపంలో ఉద్యోగులకు నిర్వహిస్తున్న యోగ శిక్షణ కార్యక్రమం మూడో రోజు బుధవారం కొనసాగింది. ఈ శిక్షణ కార్యక్రమంల ట్రైనర్లు పాబోలు సీతారామస్వామి, తోట చంద్రమోహన్, వేగి భద్రం శిక్షణ ఇచ్చారు. అలాగే మండల పరిషత్ కార్యాలయం నుంచి యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జెవిఆర్.రమేష్, సిడిపిఒ ఎం.పూర్ణిమ, ఇఒపిఆర్‌డి సూర్య భాస్కరరావు, ఎంఇఒ స్వామి, పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్, వైద్య శాఖ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. **కాజులూరు** స్థానిక కల్యాణ మండపంలో మండల స్థాయి యోగా శిక్షణా తరగతులు ఎంపిడిఒ రాంబాబు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ శిక్షణా తరగతులు 30వ తేదీ వరకు జరుగుతాయని ఆయన తెలిపారు నాలుగు రోజులపాటు జరుగుతాయన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **రౌతులపూడి** రౌతులపూడిలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శివరామకృష్ణ, ఎంపిపి గంటిమళ్ల రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రామచంద్రమూర్తి, టిడిపి నాయకులు ఇటంశెట్టి అశోక్, పైల వేణు పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక టిటిడిలో యోగాపై శిక్షణ కార్యక్రమం జరిగింది. డిప్యూటీ ఎంపిడిఒ ఎం.భైరవమూర్తి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ సతీష్ ఆధ్వర్యంలో ట్రైనర్లు బంగారాజు, శ్రీనివాస్, రవి, ఆయుష్ మాస్టర్ ట్రైనర్స్ జగదాంబ, లక్ష్మణ్ కుమార్ శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **పెద్దాపురం** మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఒ త్సలికి దొరబాబు,కార్యాలయం ఎఒ ఎం సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో యోగాపై శిక్షణ తరగతుల కొనసాగాయి. ట్రైనర్లు బి.ఈశ్వరరావు, యు.భార్గవి, వి.రామతులసి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **కరప** స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బజారు సెంటర్ వరకూ యోగాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ ఎం.అనుపమ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బజారు సెంటర్లో మానవహారంగా ఏర్పడి యోగాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సలాది శ్రీనివాసరావు, ఎఒ బిఎల్.నరసింహం, మెడికల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

యానాం వార్తలు

జాబ్ మేళాలో 56 మంది ఎంపిక

ప్రజాశక్తి - యానాం

స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 56 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. తమిళనాడు కాంచీపురంలోని ఎల్ అండ్ టి కంపెనీ డి.కాంతారావు ఆధ్వర్యంలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, వెల్డర్, మెకానిక్ మోటార్ ట్రేడులకు సంబంధించి 56 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ సిహెచ్.కృష్ణ సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.ఆనంద్, లంక ప్రసాదరావు, యాళ్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 8న జెఇ పోస్టులకు రాత పరీక్ష

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరిలోని విద్యుత్ శాఖలో జూనియర్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) పోస్టుల భర్తీకి జూన్ 8వ తేదీన రాత పరీక్ష నిర్వహించనున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అడ్మినిస్ట్రేటివ్ రీఫార్మ్స్ శాఖ కార్యదర్శి వి జయశంకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్‌ను ఈనెల 29న ఉదయం 10 గంటల నుంచి ఆన్‌లైన్‌లో రిక్రూట్మెంట్.పివై.గొ.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 0413-2233338 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిడి రమేష్

ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో ఉపాధి కూలీల సంఖ్యని పెంచాలని ఎపిడి రమేష్ అన్నారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు, ఆ పనుల ద్వారా వచ్చే ఆదాయంపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన పెంచాలన్నారు. తద్వారా కూలీల సంఖ్యను పెంపుదల చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని గ్రామాల వారీగా ఉపాధి పనులు, వారికి వచ్చే వేతనాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఎపిఒ సుధీర్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కాలువల్లో పూడిక పనుల ప్రారంభం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణంలోని సూరంపేటలో కాలువ పూడిక తీత పనులను పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సాగునీరు ఇబ్బందులు లేకుండా కాలువ పూడిక పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ మొరాలశెట్టి సునీల్‌కుమార్, జనసేన నాయకులు బస చిట్టిబాబు, కదారి తమ్మినాయుడు, మామిడాల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న మర్రెడ్డి

స్టూడెంట్ కిట్ స్టాక్ పాయింట్ పరిశీలన

ప్రజాశక్తి - కరప

స్థానికంగా ఏర్పాటు చేసిన స్టూడెంట్ కిట్స్ స్టాక్ పాయింట్‌ను జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.వేణుగోపాలరావు బుధవారం పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సిఎంఒ చామంతి నాగేశ్వరరావు, ఎంఇఒ పి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పడిపోయినది

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రపురం మండలం, ఓదూరు గ్రామం, డో.నెం.5-38రు కాపురస్తులు పొట్లకాయల కృష్ణమూర్తి గారి కుమారుడు **పొట్లకాయల చంద్రశేఖర్** గారు యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా యొక్క పాస్‌పోర్ట్ నెం. **S6409344,** తేది 27-11-2018 కలది నేను ది.20-04-2025 తేదీన జిరాక్స్ నిమిత్తం మా ఇంటి నుండి ఓదూరు గ్రామం సెంటర్‌లో గల జిరాక్స్ షాపుకు నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టును తీసుకొని వెళ్ళుచుండగా నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. ఎంత వెతికినను దొరకలేదు. కావున ఈ పాస్‌పోర్టు దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

పొట్లకాయల చంద్రశేఖర్
S/o. కృష్ణమూర్తి, ఓదూరు గ్రామం, సెల్: 9553277437

దస్తావేజులు పోయినవి

తూ॥గో॥జిల్లా, కొవ్వూరు మండలం, ఆరికిరేవుల గ్రామ కాపురస్తులు మట్టా సూర్యచంద్రరావు గారి దత్తత కుమారుడు అంతర్వేది అను నాకు ఆరికిరేవుల గ్రామంలో ఆర్.యస్. నెం. 57 రు, చ॥గ॥ 242 లు స్థలము, అందున ప్రస్తుత డోర్ నెం. 1-120/3 రు గల ఆర్.సి.సి. డాబా ఇల్లు కలదు. సదరు నా ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ లింకు దస్తావేజులు 1) ది. 09-08-2001వ తేదీన కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో దస్తావేజు నెం. 1895/2001 గా రిజిష్టర్డు కాబడిన దఖలు దస్తావేజు, 2) ది. 02-07-1949వ తేదీన కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో దస్తావేజు నెం. 1454/1949 గా రిజిష్టర్డు కాబడిన క్రియ దస్తావేజు, 3) ది. 25-06-1929వ తేదీన కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో దస్తావేజు నెం. 1965/1929 గా రిజిష్టర్డు కాబడిన క్రియ దస్తావేజు వెరశి మూడు ఒరిజినల్ దస్తావేజులు గల కవర్ ది. 28-05-2025వ తేదీన ఉదయం సుమారు గం॥ 11.00ల సమయంలో నేను నా మోటారు సైకిల్‌పై కొవ్వూరు పట్టణం, మెయిన్ బజార్‌లో జిరాక్స్ తీయించుకుని వస్తుండగా పోయినది. అంతట నేను సదరు జిరాక్స్ వద్ద, దారి మార్గములో ఎంక్వయిరీ చేసిననూ, నాకు సదరు దస్తావేజులు గల కవర్ దొరికియుండలేదు. కావున సదరు దస్తావేజులు ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది చిరునామాకు తెలియజేయగలరు.

ఇట్లు: **మట్టా అంతర్వేది,**
తండ్రి: మట్టా సూర్యచంద్రరావు
డోర్ నెం. 1-120/3, ఆరికిరేవుల
కొవ్వూరు మండలం, తూ॥గో॥జిల్లా
సెల్: 9515828552

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
I.P. No. 13/2025

Between:
Tothadi Uday Kumar, S/o. Venkata Satya Rao, aged 28 years, Calling Nil, resident of D.No. 8-252, Industrial Colony, Rajamahendravaram, E.G.Dt.,
...Petitioner

AND

1. Bathina Sai Durga Prasad, S/o. Chandi Babu, aged 40 years, resident of D.No. 8-252, Opp: Gudala Raju's House, Industrial Colony, Mallayyapeta, Rajamahendravaram, E.G.Dt.,
2. Vada Karuna, W/o. Appanna, aged 35 years, resident of D.no. 8-252, Opp: Gudala Raju's House, Industrial Colony, Mallayyapeta, Rajamahendravaram, E.G.Dt.,
3. Naralasetti Mani, W/o. Ramana, aged 35 years, resident of Hosanna Mandiram, Kallupaka Backside house, Industrial Colony, Mallayyapeta, Rajamahendravaram, E.G.Dt.,
4. Kodavati Durga Devi, W/o. Sridhar, aged 30 years, resident of Opp: Board High School, Anganwadi Opposite House, Saibaba Temple Street, Bhavanipuram, Rajamahendravaram, E.G.Dt.,
5. Bojja Durga Hari Babu, S/o. Chitti Babu, aged 35 years, resident of Beside Seethamma House, Industrial Colony, Mallayyapeta, Rajamahendravaram, E.G.Dt.,
6. Akula Uma Sankar, Father's name Not known, aged 30 years, resident of 2nd House, Water Tank Street, V.V.Nagar, Ganapathi Nagar, Rajamahendravaram, E.G.Dt.,
7. Simhadri Veera Babu, S/o. Bhadra Rao, aged 38 years, resident of Beside Water Tank Street, Bhavanipuram, Samadula Street, Rajamahendravaram, E.G.Dt.,
8. Siddhantham Kumari, W/o. Mangacharyulu, aged 35 years, resident of D.No. 115-15-117, Vijaya Medical Shop Opposite Street, Official Colony, Konthamuru Village, Rajamahendravaram Rural Mandal, E.G.Dt.,

...Respondents

పై గ్రంథములో పిటీషనరు/ డెటరు తనకు గల అప్పులు చెల్లించు శక్తి లేదని ఇన్సాల్వెంటుగా/ దివాళాదారుగా డిక్లేరు చేయమని కోరుచూ పై పిటీషను దాఖలు చేసియున్నారు. కావున పైన తెలిపిన రెస్పాండెంట్సుకు గాని, ఎవరికైనా పై గ్రంథములో ఏమైనా అభ్యంతరములు ఉన్న ఎడల **ది. 03-7-2025వ తేదీన** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని **ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరై వారికి గల అభ్యంతరములు పై కోర్టు వారి ఎదుట మనవి చేసుకోవలెను. కావున ఎల్లరుకు తెలియపర్చడమైనది.

జె.బి.ఎస్.బాపూజీ
రాజమండ్రి అడ్వకేట్, రాజమండ్రి
28-5-2025 సెల్: 8309867728